క్లుప్తంగా

జూన్ 9 వరకు విభిన్న ప్రతిభావంతుల సర్వే

చీరాల అర్బన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సర్వేను ఈనెల 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు పట్టణ, గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–2 పి.సుధారాణి శనివారం తెలిపారు. 18 ఏళ్ల లోపు గల విభిన్న ప్రతిభావంతుల (మానసిక, వినికిడి, శారీరక, దృష్టి, మాటలోపం ఉన్న పిల్లలు) సర్వే నిర్వహించి వారికి నాణ్యమైన విద్య పరికరాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిల్స్‌ను ప్రభుత్వం నుంచి అందించడానికి దోహదపడుతుందన్నారు. అలానే భవిత కేంద్రం ద్వారా స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌తో పాటు అడిటిజం లక్షణాలున్న వారిని గుర్తించి విద్య అందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం పట్టణ, రూరల్ గ్రామాల్లో ఐఈఆర్టీలు డి.రాజశేఖర్ బాబు, బి. నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేను ఆమె పర్యవేక్షించారు.

పండ్ల తోటల పెంపకంతో లాభాలు

చీరాల టౌన్: రైతులు.. పండ్ల తోటల పెంకంతో ఆర్థిక వృద్ధి సాధ్యమని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దాసు కోరారు. పండ్ల తోటల పెంపకానికి కావాల్సిన సమాచారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉందని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్నకార రైతులు, ఎస్సీ, ఎస్టీలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండ్లతోటల పెంపకంలో మామిడి, సపోట, జామ, సీతాఫలం, జీడిమామిడి పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. పండ్ల తోటల పెంపకాలు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, బ్యాంకు ఖాతా నకళ్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సత్వరం రెవెన్యూ సేవలు అందించండి

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందంచడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఓటీసీ) చేయించాలన్నారు. వివిధ ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



బల్లికురవ: బల్లికురవలోని వెంకటేశ్వర స్వామి మందిరంలో శనివారం మండల పూజా మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయానికి దక్షిణ భాగంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో వెంకటేశ్వరస్వామి మందిరాన్ని ఇటీవల నిర్మించారు. ఈ మందిరంలో ఏప్రిల్ 14న శంకు, నామాలు, చక్రాలు, నామాలు వేద మంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠించారు. వేడుకల్లో భాగంగా అర్చకులు పి. పవన్ కుమార్ శర్మచే పంచామృతాలతో అభిషేకం, పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రికి గోవాడకు చెందిన బ్రహ్మయ్య చేపట్టిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఎబంధుమిత్రుల రాకతో పండగ వాతావరణం నెలకొంది.

‘ప్రత్యేక’త ఏముందీ!

- అధ్వానంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం
- కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు



ఈపురుపాలెం గ్రామ పంచాయతీలోని సీతారామపేట గేటు రోడ్డులో నెలల తరబడి నిల్వ ఉన్న మురుగునీరు



డంపింగ్ యార్డుగా మార్చేసి వ్యర్థాలతో నిండిన తోటవారిపాలెం వెళ్లే స్ట్రయిట్ కట్ రహదారి

చీరాల టౌన్: మండలం చెత్త కుప్పగా మారింది. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 15 పంచాయతీల్లో రెండు గ్రామ పంచాయతీలు మినహా మిగిలినచోట్ల సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచి పోతోంది. సిబ్బందికి సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో చాలామంది విధులకు రావడం మానేశారు. ఫలితంగా గ్రామాలు అధ్వానంగా మారాయి. గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, ప్రత్యేకాధికారులు వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవు. గ్రామాల్లోకి ఎవరైనా జిల్లా అధికారో, ప్రజాప్రతినిధులు వస్తే మాత్రం ఆ పరిసరాలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. దేవాంగపురి, ఈపురుపాలెం, గవినివారిపాలెం గ్రామాలు జనాభాపరంగా, ఆదాయ పరంగా ఎక్కువైనవి, కానీ ఈ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అరకొరగా ఉండటంతో వీధుల వెంట చెత్తాచెదారాలు కనిపిస్తూనే ఉన్నాయి. చీరాల మున్సిపాలిటీకి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్ పంచాయతీలు చిన్న గ్రామాలు. పంచాయతీకి ఆదాయం ఉన్నప్పటికీ పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ ఫలితం శూన్యం. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో కూడా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీలకు ప్రభుత్వం మండల స్థాయి అధికారులైన ఎంపీడీఓ, ఈవోఆర్డీ, మండల విద్యాశాఖాధికారి, మండల వ్యవసాయాధికారి, మండల సీడీపీవోలను గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా కలెక్టర్ నియమించారు. కానీ వారానికి ఒకసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో, మంచినీటి పంపుల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. అంతేగాక ఈ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందడం వలన రోగాల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించాల్సిన పారిశుద్ధ్య పర్యవేక్షకులు మొక్కుబడిగానే పని చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీల ప్రత్యేకాధికారులు వీరే..

చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నియమించారు. బుర్లవారిపాలెం, ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం, పిట్టువారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల గ్రామ పంచాయతీలకు ఈఓఆర్డీ ఎ.రామకృష్ణ, కొత్తపాలెం, విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు, రామకృష్ణాపురం, కావూరివారిపాలెం పంచాయతీలకు సీడీపీఓ, చీరాలనగర్, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీలకు పి.సుబ్రమణ్యేశ్వరరావు.. ఎంఈఓ, గాంధీనగర్, వాడరేవు గ్రామ పంచాయతీలకు ఐ.సుమతి మండల వ్యవసాయాధికారులను ప్రత్యేకాధికారులగా నియమించారు.

సిబ్బంది లేకనే ఇబ్బంది: పి.శివసుబ్రహ్మణ్యం, చీరాల ఎంపీడీఓ

గ్రామాల్లో చెత్త కుప్పలు తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేరు. అయితే ఉన్నంత మంది సిబ్బందితోనే సమస్యను పరిష్కరిస్తున్నాం. వీధుల వెంట చెత్తాచెదారాలు వేయకుండా ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నాం. ప్రజలు డస్ట్‌బిన్లు వినియోగించడంతో పాటు నివాస ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా పేర్చవద్దు. ప్రత్యేకాధికారులు కూడా గ్రామాలును సందర్శించేలా కృషి చేస్తా.

ఎండీయూల రద్దు అమానుషం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్

అద్దంకి: గత ఐదు సంవత్సరాల నుంచి ఇళ్ల వద్దే రేషన్ అందిస్తున్న ఎండీయూ వాహనాలను, రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా రద్దు చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మంజుందర్ అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎండీ వాహనాలను తొలగించడంపై ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అంజేసిన అనంతరం మజుందర్ మాట్లాడారు. రాష్ట్రంలో 18,520 మంది ఎండీయూ వాహనాలను నడిపిన నిస్వార్థ సేవకులను ఒక్క కలం పోటుతో తొలగించడం సరికాదన్నారు. ఎండీ వాహనాల వల్ల అవినీతి జరుగుతోందని ఆరోపించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే నిజంగా అవినీతి ఎక్కడ జరిగిందో విచారించాలని డిమాండ్ చేశారు. వాహనాలను నడుపతున్న వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల వారేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఆయా వర్గాల పట్ల కక్ష సాధిస్తుందన్నారు. ప్రభుత్వాలు అనేవి ఉపాధి కల్పించాలి కాని ఉపాధి తీసేయడం కాదన్నారు. కావాలంటే లెక్కలు తీయండని, వారిలో అత్యధిక భాగం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల వారే ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ చర్యను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, ఎండీ వాహన ఆపరేటర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ చేయాలి



చీరాల : రేషన డీలర్లుకు సూచనలందిస్తున్న తహసీల్దార్ గోపికృష్ణ

వేటపాలెం: మండల పరిధిలోని అన్ని రేషన్ దుకాణాల్లో జూన్ 1వ తేదీ నుంచి షాపుల్లోనే సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లకు శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందని తెలిపారు. పంపిణీలో ఏటువంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. తూకాలు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇక నుంచి డీలర్లు రేషన్ బియ్యంకి వచ్చే గోతాలు కూడా గోడౌనుకి అప్పగించాలని తెలిపారు. కార్డు దారుల నుంచి ఎటువంటి పిర్యాదులు అందినా డీలర్ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.గోపీ కృష్ణ సూచించారు. శనివారం చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లో రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. రేషన్ సరుకులను జూన్ 1 నుంచి ప్రతీ డీలర్ విధిగా రేషన్ దుకాణాల ద్వారానే ప్రజలకు అందించాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, సరుకులకు బ్లాక్ మార్కెట్ తరలించినా చర్యలు తప్పవని తహసీల్దార్ డీలర్లకు హెచ్చరించారు.

చీరాలలో కుంభవృష్టి



మధ్యాహ్నం ఎండతీవ్రతకు జనసంచారం లేక వెలవెలబోతున్న పోలీసు స్టేషన్ రోడ్డు



ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ క్రీడా మైదానంలో చెరువులా మారిన దృశ్యం

చీరాల రూరల్: నియోజకవర్గ కేంద్రం చీరాలలో శనివారం తెల్లవారుజామున పిడుగులతో కూడిన కుంభవృష్టి కురిసింది. తెల్లవారు జామున సుమారు రెండు గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం నాలుగు గంటల వరకు నిరంతరాయంగా కురిసింది. వర్షానికితోడు భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులు తోడవడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అనేకచోట్ల ఇళ్లమధ్యలోనే పిడుగులు పడిన అనుభూతి కలగడంతో జనాలు కలవరపడ్డారు. భారీస్థాయిలో ఈదురుగాలులు రావడంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను కూడా పూర్తిగా నిలిపేశారు. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. భారీగా కురిసిన వర్షానికి పట్టణంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగుకాలువల్లోని మురుగునీటికి తోడు వర్షంనీరు కలవడంతో రోడ్లపై నీరు చేరింది. అలానే ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో వర్షం నీరు చిలిచిపోవడంతో చెరువును తలపించింది. ఎక్సైర్‌సైజులు చేసుకునేందుకు ఉదయాన్నే క్రీడా మైదానానికి చేరుకున్న క్రీడాకారులు, వాకరులు చెరువులా మారిన వర్షం నీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరలా ఉదయం 10 గంటల నుండే భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఎండవేడిమితో ప్రజలు అల్లాడిపోయారు. ఎండకుతోడు ఉక్కపోత కూడా అధికమవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తల్లడిల్లిపోయారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేష్

వేటపాలెం: మండల పరిధిలో జరిగే సర్వేలన్నీ పారదర్శంగా ఉండేలా నిర్వహించాలని ఎంపీడీఓ రాజేష్ ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయం సమావేశం హాల్లో మండలంలో జరిగే సర్వేలపై కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లకు సమావేశం శనివారం నిర్వహించారు. ఏంపీడీఓ మాట్లాడుతూ ఈకేవైసీ సర్వే మూడు రోజులల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 6 ఏళ్ల లోపు పిల్లకు ఆధార్ కార్డులు ఇప్పించాలని సూచించారు. ఆధార్ కార్డులు లేని పిల్లలకు వారి పేర్లు సంబంధిత అంగన్‌వాడీ టీచర్లకు చెప్పి వారి ద్వారా బర్త్ సర్టిఫికెట్ తెప్పించుకొని ఆన్‌లైన్‌లో పొందు పరచాలని తెలిపారు. రైస్ కార్డులకు సంబంధించి ఆన్‌లైన్‌లో పొందుపరచి వీటన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయలక్ష్మి, ఏ. శ్రీనివాసరవు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా దినోత్సవం

మార్టూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో శనివారం అధికారులు ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. బాపట్ల ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగ మాస్టర్ చంద్ర ఆసనాల గురించి వివరించారు. డాక్టర్ పి. కృష్ణ కుమార్, డాక్టర్ పి. అంజమ్మ, సిబ్బంది శేష సాయి, తనూజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో మేలు



చీరాల: మ్యూజిక్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

సంతమాగలూరు (అద్దంకి రూరల్): వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో మేలు చేయిస్తామని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన విజ్ఞాన శిబిరంలో 15 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిచే లైబ్రేరియన్ పుస్తకాలు చదివించారు.

చీరాల: గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ శనివారం తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు పుస్తకాలు చదివారు. మ్యూజిక్ టీచర్ రూపాదేవి పిల్లలకు మ్యూజిక్ క్లాస్‌లు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకులు పూజ

వేటపాలెం: స్థానిక చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం ప్రాంగణలోగల వేంచేసియున్న సువర్చలాసమేత వీరంజనేయ స్వామివారికి నాగావలి దళార్చన లక్ష తమలార్చన పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆల యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా స్వామి వారికి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి నిర్వహించిన లక్ష తమలపాకులు పూజా కార్యక్రమాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు హనుమాచారి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఇంకొల్లు (చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ బాల్ టోర్నమెంట్‌లో శనివారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్ ఉప్పుగుండూరు క్రిస్టియన్ యూత్, ఇంకొల్లు స్టాలిన్ యూత్ మధ్య నిర్వహించగా ఉప్పుగుండూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఇంకొల్లు ఫ్రెండ్స్ సర్కిల్, కేశవరప్పాడు అంబేద్కర్ యూత్ మధ్య జరిగ్గా ఇంకొల్లు విజయం పొందింది. మూడో మ్యాచ్ వలపర్ల క్రికెట్ జట్టు, బూదవాడ అంబేడ్కర్ యూత్ మధ్య జరిగ్గా వలపర్ల విజయకేతనం ఎగురవేసింది.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

జె. పంగులూరు: ఒకే బైక్‌పై వస్తోన్న ముగ్గురు వ్యక్తులు కింద పడిపోయి గాయాల పాలైన సంఘటన బైట మంజులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. అద్దంకి మండలం దేనువకొండ గ్రామానికి చెందిన ప్రేమ సాగర్, కె.పూర్ణమ్మ, కె. మెషక్ చిలకలూరిపేట నుంచి అద్దంకి వెళ్తుతుండగా అదుపు తప్పి కింద పడ్డారు. ఎస్సై వినోద్ బాబు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని గేదె మృతి

జె. పంగులూరు: ఆర్టీసీకి చెందిన ఇంద్ర బస్సు ఢీకొని ఒక గేదె మృతి చెందిన సంఘటన బైట మంజులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. బస్సు ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళుతుండగా బైట మంజులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న గేదెల గుంపును వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది.

వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తను దూషించిన కానిస్టేబుల్

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన మహిళా కార్యకర్త ప్రభావతి పై ఒంగోలులో పనిచేస్తున్న కానిస్టేబులు వీరాంజనేయులు ఈనెల 2వ తేదీన ఫోన్‌లో అసభ్యకర పదజాలంతో దూషించాడు. అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బారాజు శనివారం కేసునమోదు చేశారు.